# విచిత్ర పంచాంగం

తామరపల్లి జోగారావుగారు

శ్రీరాములు, అవిఘ్నమస్తు.

## అధ టైటిలు పేజి ప్రకారౌ

శ్రీమత్ క్రీస్తు శకాబ్ద, స్పెషల్ నామ 1935 సంవత్సర, సర్వజనమత సమ్మత సర్వరసభాషా సంకలిత రాద్ధాంత సిద్ధాంత విచిత్రాంత పంచాంగం.

సదరు పంచాంగం
మాతరాలప్పి గోజావార్యా సిద్ధాంతిచే గణింపబడి,
టిక్కర్లి ఉశికార్యాచార్యులచే గుణింపబడి,
అపండితత్రయంచే సవరింపబడి,
నిరక్షరకుక్షి సంఘముచే ప్రచురించబడి,
నిషేధాక్షరీ ముద్రాక్షరశాలలో ముద్రింపబడియె.

**వెల—లేదు.**

షరా: (1) ఏతత్ పంచాంగం ప్రచారం నిమిత్తం నియమింపబడియె గావున, యెల్లరు ఖర్చుల నిమిత్తం పది అణాలుమాత్రం మా కార్యాలయమునకు బంపిన ప్రతి నొకదానిని బడయగలరు. (2) వర్జం పట్టింపు లేనివారలకును, పాశ్చాత్త్యులకును, పాశ్చాత్త్య వేషభాషావలంబకులకును, తొందర పనిగలవారలకును ఇత్యాదులకు ఈ పంచాంగం వర్తింపనేరదు.

## అధ సంవత్సరాగమ ప్రకరణౌ

ఈ సంవత్సరాగమం గురించి పండిత బృందములలో భేదాభిప్రాయాలు బయలువెడలినను, మా సిద్ధాంతుల వారి సిద్ధాంతాన్ని అనుసరించి తేలిన ముఖ్యాంశం బెయ్యదనిన—

బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు భూలోకంలోని ధరల విషయంలో అభిప్రాయభేదములు కల్గుటచే, సదరు వాదము తీర్మానమయ్యే పర్యంతము పురాతన ఫక్కీని వ్యవహరింపక, భూలోకమునకు మాత్రము ఒక స్పెషల్ సంవత్సరమును కల్పించి, అన్నిగ్రహములకు స్పెషల్ డ్యూటీలు వారేర్పరుచుటచేత నీ స్పెషల్ సంవత్సరం ఆదేశమయ్యె.

"ఈ వత్సరం జనవరితో ప్రారంభమై వివాదానంతరం దనుక సాగవలయును సుమా" యని ఈశ్వరుడు పార్వతీదేవితో చెప్పిరని దేవదూతలు మాలో నొక సిద్ధాంతిగారికి వార్తనంపినటుల దెలియుచున్నది.

## అధ సందేహాస్పద ప్రకరణౌ

ఇంకను మా సిద్ధాంతులలో నొక పరకాయ ప్రవేశాభ్యాసకులగు సిద్ధాంతులవారికి ఈ క్రింది సందేశము నాతడు నిదురబోవుచుండ, శ్రీ నారదమహామునులవారు, రెక్కలు కటబడి రెండు ఇంజనులుగల నరాకారపు మోటారులో వచ్చి తెలియపర్చినటుల సూచా వాచా మాకు దెలిసెనుగాని, నారదమహామునులవారికి ఆ విమానమును కొనునంత యార్థికస్థితి లేకపోవుటచే మేము నమ్మకపోయినను కొపుదలకై మే మెఱింగించు సందేహాస్పదంపు సందేశం బెయ్యదనిన—

సదరు కలహకారణంబు లెఱింగిన శ్రీ యమధర్మరాజులవారు సదరు కలహకారణంబగు నరలోకంబుపై కినుకవహించినవారలై రహస్యంబుగ తన దూతల రావించి, నరలోకంబున మరణంబు లధికమగుటకు

గాను ఈ క్రింది కార్యముల గావింపుడని వారల కుప దేశించెనట:

(1) నరుల కాలాంతంబునకుగాను వారు కల్పించు వింతవింత రోగముల రూపుమాపుటకు తెలయు వైద్యులలో ఇంగ్లీషు వైద్యులు విద్యాభ్యాసనా కాలముననే శరీరముల పాడుజేసుకొని మున్ముందు మేధాశక్తి లేని వారలుగను, ఆయుర్వేద వైద్యులు ఆశల కంతులేని వారలుగను, తదితర పద్ధతులలో నరులకు నమ్మకము లేకుండునటులను జేయుట;

(2) బిడ్డల బుద్ధులు క్రమాభివృద్ధి నొందించు గురువుల జీతములు తగ్గ పరిస్థితులు కల్పించి వారివారి మనంబుల క్లేశము కల్పించుట;

(3) జాతులలోకెల్ల అగ్రజాతియగు బ్రాహ్మణులు అయుర్వృద్ధికి అనువగు ఉపాయముల నాలోచించకుండ యుండుటకై వారల భూములయొక్క సాగు హక్కు తొలగించుట మొదలగు కార్యములొనరించి; వారి మనంబుల నితరత్రా ఆకర్షించుట; ఇవి ముఖ్యములట.

## అథఫల ప్రకరణే—అథకందాయ ఫలాని

ఈ సంవత్సరం 'మేఘా గగనంచ' మేఘములు ఆకాశ మార్గాని పోవుచుండుటచేత వర్షములు సాధారణముగా కురియవు. అయినను అంతయెత్తున పర్వతములు గల స్థలములలో ఒక కుంచెడు వర్షము పడును. కాబట్టి యీ తర్కణము కనిపెట్టి, సోడాలు అమ్మేవారు అచ్చట నీరంతా బుడ్లలోకెత్తి గ్రామములంట అమ్మెదురు.

తా॥క॥—ఈలోగా ఎవరైనా ఒక సంఘమువారు ముందుగా ఆ స్థలముల తంచనాకట్టి, అక్రమించి, పైవారికి పన్నులువిధించి, రాబడి హెచ్చించుకోవచ్చునని లక్ష్మీదేవి హుకుంఅయినటుల మాకు తెలియు చున్నది.

ఈ సంవత్సరం వర్షములు లేకపోయినను, తన పుత్రికలు సామ దాన భేద దండోపాయంబులచే తమతమ హక్కుల స్థాపింపజూచుచున్నందులకు భూదేవి దుఃఖ సంతోషాతిశయంబులచే విడుచు కన్నీరు కాలువలై పారు ప్రదేశములలో పంటలకు సరిపడు నీటివసతి యేర్పడును గాన—తెలివిలేని వర్తకులుగల స్థలములలో దినుసులు చౌకగా దొరుకును. ఈ విపత్తు నాలోచించిన వర్తకులు ధరలు హెచ్చించి విపరీత లాభముల పొందుదురు.

## అథగ్రహకూట ఫలాని

I. భార్యాధిపతి, భర్తః—అగుటచేత స్త్రీలకు పురుషులే భర్తలు. (కొన్నికొన్ని స్థలాల్లో తలక్రిందు కావచ్చు గూడా!)

II. ధనాధిపతి, శనిః—అందుచేత సర్వత్రా డబ్బు దొరకకపోవుటచేత చిత్రవిచిత్రముష్టులు బయలుదేరును. అందు ముఖ్యమగున వియ్యవనిన:

(1) "జేబులో ఒక రూపాయి వుందేమో చూడండి—మళ్ళీ తర్వాత యిస్తాగా!" అనే దర్జాముష్టి.

(2) 'అయ్యా! తమ తాలూకు చందా యిప్పించేరుకారు' అనే దయాముష్టి.

(3) పరీక్షలలో సరిగ్గా పాతాలురాని స్కూలు పిల్లవాండ్ర దొంగముష్టి.

(4) పెండ్లిండ్లు వగైరాల సందర్భమున గ్రామఫోను, ప్లేటులు, జంబుఖానాలు, సరుకులు వగైరాల ముష్టి (మళ్ళీ యిచ్చేస్తామనే!)

(5) నాటకాలకు, సినీమాలకు టిక్కెట్లకోసం, అధికార్ల దబాయింపు ముష్టి—ఇత్యాదులు.

ఇంతియేగాక, ధనార్జనకై నరు లనేకములగు వృత్తుల నవలంబింతురు. అట్టివారల నీ క్రింది తెగలుగ విభజింపవగు:

(1) బాగుగ చదువుకొన్నవారు—వీరు తమ సర్వస్వమును చదువుక్రిందనే వినియోగపర్చుటచే నీ సంవత్సరము తప్పక బానిసవృత్తినే యవలంబించి, తక్కువవేతనములకు తలల నమ్ముకొందురు.

(2) బాగుగ చదువుకొనినవారు—వీరియందనేకులు చదువుకొనుదినములలో చదువనేరక దేశభక్తులైయుండి, యీ సంవత్సరం అనేక భీమాకంపెనీలలాంటి సంస్థల లేవదీసిగాని, అందు పనిచేసిగాని ధనార్జన చేయుదురు. ఎన్ని విధముల ప్రయత్నించినను యీ సంవత్సరం సొమ్ము దొరుకుట దుర్లభం కొబట్టి కొందఱు నగలను విక్రయించి నగదును పెట్టెలలో దాచియుంచుకొందురు.

III. విద్యాధిపతిః బృహస్పతిః— ఈతడు ముసలివాడగుటచేత భేషజం ఎక్కువ—చదువుచెప్పే ఓపిక తక్కువ, మరుపు జాస్తి.

కొబట్టి యీతని పరిపాలనలో విద్యావిషయంలో అనేకములైన మార్పులు జరుగుచుండును. గంటకో స్కీము తయారవుతూ ఉంటుంది. చాలా స్కూళ్లలో చదువుకన్న చక్కదనానికే ప్రాముఖ్యత యివ్వబడుతుంది.

IV. గృహాధిపతిః మూషకః—అగుటచేత ఇండ్లలో సామాన్లన్నీ మాయమౌతుంటాయి. అప్పుడప్పుడు ప్లేగు కూడా ప్రబలును.

వివాహాధిపతిః విదూషకః— ఈతని పరిపాలనలో వింత వివాహాలు జరుగును—అనగా, బ్రహ్మచారులకు, పూర్వసువాసినులకు బహిరంగ వివాహాలు; సన్యాసులకు, వితంతువులకు రహస్యవివాహాలు; కన్య వయస్సు యెంతఉన్నా బహిరంగంగా హెచ్చువయస్సును ప్రకటించి చేసే వివాహాలు; ఇత్యాదులు.

## ముఖ్యపండుగలు

1. ఏ కారణంచేతనైనా సెలవుదొరికిన రోజు విద్యార్థులకు పండుగ.

2. టీపార్టీలు వగైరాలు జరిగేరోజులు కాఫీహోటలు మేనేజర్లకే గాకుండా, పెద్దమనుష్యులకు (ఉభయలింగాలూ) పండుగ.

3. తాలూకొఆఫీసు గుమస్తాలకు తహసీలుదారుగారు సర్క్యూటులో ఉన్న దినాలు పండుగ.

4. లంచాలు తడుముకొనే గుమస్తాలకు ఆఫీసుదినాలు పండుగ.

5. వయస్సు నిర్ధారణచేయించుకోని ఆసామీ మరణించిన దినం ఇన్స్యూరెన్సు కంపెనీలకు పండుగ (పట్టాసొమ్ము ఫైసల్ చెయ్యొచ్చు).

6. రాత్రిపూట వర్షంపడ్డ దినాలు జట్కావాలాలకు జల్సాపండుగ.

7. ఎలక్షన్ దినాలు బ్రోకర్లకు బోలెడు పండుగ.

('ఆ దినాల్లో కల్లంగడులకు మంచి గిరాకీకూడా ఉండవచ్చు'ననీ సూత ఉవాచ. అనగా పార్వతీదేవికి శివుడు చెప్పెనట!)

8. నవనాగరిక స్త్రీలకు టెన్నిసుపందెములు జరిగే దినాలు పండుగ.

9. బోర్డుస్కూళ్ళ మేష్టర్లకి జీతాలు బట్వాడా దినాలు బలే పండుగ.

## శుభదినములు

I. ప్రయాణమునకు—ఇంటివద్ద భార్య వెళ్లవద్దని పోరుతున్నప్పుడు, ఒకరు ఫోంచెయ్యమంటున్నా ఫోం చెయ్యకుండా నిరాకరించీ, బయలుదేరడం, బయల్దేరే వేళలో 'ఎక్కడికి?' అని ఒకరు ప్రశ్నించేటప్పుడు, జన్మనక్షత్రం ఉన్న సమయాన్ని, పిల్లి, వితంతువు, ఎదురైనప్పుడు, గాడిద సింహనాదం (అనగా జయభేరి) చేసేటప్పుడు ప్రయాణమునకు శుభదినములు. అనగా పాపభూయిష్టమైన భూలోకం అట్టి ప్రయాణస్థునకు దృష్టిపథంనుండి దాటును.

II. క్షౌరములకు— నిత్యం టీపార్టీలమీద ఆధారపడే వాళ్ళకు—ఆహ్వానం వచ్చిన వెంటనే శుభం.

నటీనటులకు—ఎల్లప్పుడూ రాత్రికాలం శుభం.

లోభులకు—పిత్రాదులు మరణించినదినం శుభం.

గుమస్తాలకు—జీతాలు ముట్టినదినం శుభం.

నిష్ఠపరులకు—భార్య గర్భిణిగా ఉన్నపుడు, మహాలయపక్షపు దినములు, అమావాస్య మొదలగు పంచపర్వదినాలు, పితృకార్యపు రోజులు శుభం.

వరా: స్వంత క్షౌరాలు చేసుకునేవాళ్ళకు కాలనిర్ణయం లేదు.—ఇతీ క్షౌరపురాణే సప్తమోధ్యాయః.

ఈ సంవత్సరం జరిగే క్షౌరములలో రకములు:

1. తిన్నగా గురువుగారి యింటిపనిచేయని విద్యార్థులకు పరీక్షలలో మార్కులు క్షౌరం.

2. వేసంగిలో ఉద్యోగిగారి యింట్లో కూడా పంకాలాగని బంట్రోతుకు జీతం క్షౌరం.

3. కొన్నికొన్ని పాఠశాలల్లోని మేష్టర్ల జీతాలలో తిరుపతిక్షౌరం.

4. మాసపత్రికల్లో అదృష్టసంఖ్యల్ని ఆశించేవాళ్ల ఆశలు అసలుకి క్షౌరం.

5. పలుకుబడిలేకుండా డబ్బు ఖర్చుపెట్టే అభ్యర్థులకు ఓట్లు క్షౌరం.

గృహనిర్మాణమునకు:

1. దీపావళీపండుగకు వారము పదిదినములు ముందుగ శుభం. (ఈ శుభదినము తాటియాకులతోడను, వరి, జొన్న, చొప్ప మొదలగువాటితోడను కట్టు పూరిండ్లకు ముఖ్యముగ వర్తించును.)

2. శ్రావణ భాద్రపదమాసములు శుభం. వరా: ఇయ్యది దత్తమండలములోనివారలకు వర్తింపనేరదు. అచట వర్షములు కురియుట అరుదు.)

3. చవితి, షష్ఠి, అష్టమి—యీ తిథులున్నూ, ఆది, బుధవారములున్నూ శుభదినములు.

వివాహమునకు:

1. దగ్గర బంధుగులు మిక్కిలి కష్టదశలో నుండు సమయములు.

2. గ్రామములోని దేవుని కళ్యాణము లేక మరియే యితర నవరాత్రాది యుత్సవములు జరుగు దినములు, కన్యాప్రదాతలకు మిక్కిలి శుభదినములు.

## అథస్వప్న ప్రకరణో

స్వప్నములో చూడదగినవి: చంటిబిడ్డ, ముత్తయిదువ, విధవ, నల్లని బ్రాహ్మణుడు, గాడిద, ఎనుబోతు, నక్క, నల్లపిల్లి.

స్వప్నములో చూడకూడనివి: బంగారము, నాణెములు, కుంకుమ, పసుపు.

తన్నుగుఱించి గాంచిన శుభస్వప్నముల వివరము: తాను ఒకరితో జగడమాడినటుల; తానొకనియింట ఉద్యోగమునకై నీచమగు పనులు చేసినటుల; తానొక సందర్భమున చిల్లరవేషమును వేసి, అధికారులను మెప్పించి, ప్రథమ బహుమానముగ నొక గాజువస్తువును గాని మంటివస్తువును గాని పొందినటుల; అవివాహితుడైనవాడు తానొక స్త్రీని వివాహమాడి, ఆపెకు లొంగిపోయి, నలుగురిలో గొప్పలు చెప్పుకొనుచు తిరుగుచుండినటుల; తనకు గొప్ప పదవి లభించినటుల; అట్టిస్థితిలో తాను తనవారల ఉద్యోగములో జొరబట్టి యితరుల తొలగించినటుల.

పైవిధముల గాంచిన స్వప్నములు శుభములు. తదితరములు అశుభములు.

అశుభములగు స్వప్నముల గాంచినవెంటనే నిద్రమేల్కొంచి, చల్లని నీట స్నానముచేసి, శరీరము తుడుచుకొనకుండగనే తడిబట్టను కట్టుకొని, వేరొకదానిని కప్పుకొని, ఒంటరిగ నిశ్శబ్దస్థలమున వెళ్లికలబరుండిన తద్దోషంబు నివారణంబగు.

## అథ ఆదాయవ్యయా

ఈ సంవత్సరం ఆదాయాధిపతి చంద్రుడౌటచేత రాబడి చల్లగానుండును. వ్యయాధిపతి సూర్యుడౌటచేత ఆదాయములు హరించుకొనిపోవును. కాబట్టి పాములు బైటకువచ్చును. అనగా వెండి బంగారములు భూపతనము చేసినవారు ఏ మ్యునిసిపల్ కౌన్సిల్ పనికో, ఏ జిల్లాబోర్డు మెంబరుపదవికో, మరేపదవికో ఆశించి వోటర్లకు సొమ్ము వెదజల్లిగాని, పెద్దపెద్ద కార్యాలకు లేక గొప్పగొప్పవారి యావాహనోద్వాసనలకు వీరివిగా వెచ్చించిగాని, సదరు పాములను బైటకు దీయవలసివచ్చునని పార్వతీదేవితో, శ్రీ వేదవ్యాస ఉవాచ' యని మా సిద్ధాంతులవారి యభిప్రాయము.

ఇతి

విచిత్రపంచాంగ ప్రకారేణ ప్రథమాంగ ప్రకరణం సమాప్తమ్.